క్లుప్తంగా

వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి భవిత కేంద్రంలో వలంటీర్ (ఆయా) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రాధాకృష్ణారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. సర్వశిక్ష అభియాన్ పరిధిలోని ఉద్యోగానికి రూ. 3,250 గౌరవ వేతనం ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఉన్న స్థానిక మహిళా అభ్యర్థులు ఈనెల 15లోపు మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఐటీఐ కళాశాలలో నేరుగా వచ్చి అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. వివరాల 94935 35378 సంప్రదించాలని కోరారు.

పత్తి స్లాట్‌బుకింగ్‌పై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈవో సుప్రియ

ఇచ్చోడ: రానున్న రోజుల్లో పత్తిని విక్రయించేందుకు రైతు కిసాన్ కపస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని ఏఈవో సుప్రియ అన్నారు. సోమవారం మండలంలోని ముఖరా (బి) పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పండించి పత్తి పంటను విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేస్తుందన్నారు. స్లాట్‌బుకింగ్ ద్వారా సులువుగా పత్తిని అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడవ్ మారుతి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఏఐసీసీ పరిశీలకుడిని కలిసిన 'కంది'



అజయ్‌సింగ్‌ను సన్మానిస్తున్న 'కంది'

కైలాస్‌నగర్: డీసీసీ అధ్యక్షుల ఎంపికకు సంబంధించి అభిప్రాయ సేకరణ కోసం నియమాకమైన ఏఐసీసీ పరిశీలకుడు, కర్నాటక ఎమ్మెల్యే అజయ్‌సింగ్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సోమవారం కలిశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పార్టీ పరిస్థితులను ఆయనకు వివరించారు.

వారసంతలో దీపావళి సందడి



దీపాంతలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వారసంతలో దీపావళి సందడి నెలకొంది. దీపావళి సమీపిస్తుండడంతో వారసంతకు వ్యాపారస్తులు దీపాంతలు, ముగ్గులు, పూజ సామగ్రిని విక్రయించేందుకు తీసుకువచ్చారు. కాగా వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. దీంతో వారసంతలో సందడి వాతావరణం నెలకొంది.

ముగిసిన శిక్షణ



డీఆర్పీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని స్థానిక కేబీ కాంప్లెక్స్‌లోని బీఎడ్ కళాశాలలో గణిత ఉపాధ్యాయులకు మూడు రోజుల డిజిటల్ బోధన శిక్షణ సోమవారం ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు విద్యలో సాంకేతికను జోడించే విధానాలు, యంత్రాలు పనిచేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణ అందించిన డీఆర్పీలు బండి శుభాష్, జాదవ్ నిరూప్ కుమార్, జాదవ్ సంతోష్‌లను తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పెండింగ్‌లో బీఏఎస్ నిధులు

- విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించని యజమాన్యాలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



కలెక్టరేట్ చౌక్‌లో విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న పేరెంట్స్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కులాల విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం 2000–01 సంవత్సరంలో బెస్ట్ అవేలెబుల్ స్కూల్స్ (బీఏఎస్) స్కీమ్‌ను తీసుకువచ్చింది. ఎంపికైన ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉచితంగా విద్యను అందించడంతో పాటు టెస్టు, నోటుబుక్స్, యూనిఫాం ఉచితంగా అందిస్తారు. బీఏఎస్ స్కీమ్‌లో డే స్కాలర్, డెసిడెన్షియల్ విధానం ద్వారా చదువుకునే అవకాశం కల్పిస్తోంది. అయితే 1వ తరగతి విద్యార్థులు డే స్కాలర్‌గా, ఐదో తరగతి విద్యార్థులు రెసిడెన్షియల్ స్కాలర్‌గా అవకాశాన్ని కల్పిస్తారు. సంవత్సరానికి 1వ తరగతి విద్యార్థికి రూ.28 వేలు, 5వ తరగతి విద్యార్థికి రూ. 47వేలు ప్రభుత్వం బీఏఎస్ కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోంది. పాఠశాలలకు సకాలంలో నిధులు అందకపోవడంతో విద్యార్థులను పాఠశాలలోకి యాజమాన్యాలు అనుమతించడం లేదు.

జిల్లాలో 6 పాఠశాలలు..

జిల్లాలో ఆరు పాఠశాలలను బీఏఎస్ కింద ఎంపిక చేశారు. అందులో ఆదిలాబాద్‌లో సిరాంరెడ్డి, న్యూ ప్రగతి, క్రిష్ణవేణి, ఉట్నూర్‌లో జ్ఞాన సరస్వతి, పూలాజీ బాబా, సెంట్‌పాల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కీమ్‌లో ఎంపికైన విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచితంగా విద్యనందిస్తారు. ప్రైవేట్ పాఠశాలలు కావడంతో ప్రతీ విద్య సంవత్సరం ఈ పాఠశాలలో అడ్మిషన్‌లు తీసుకున్నేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే బీఏఎస్ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో మౌలిక వసతులు కల్పించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

రూ. 5.96 కోట్లు పెండింగ్..

జిల్లాలో బెస్ట్ అవేలబుల్ స్కీమ్ కింద ఎంపికైన పాఠశాలలకు 2022–23, 2023–24, 2024–25 విద్య సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులు 423 మంది, 840 మంది ఎస్టీ విద్యార్థులు ఉండగా.. మొత్తం 1,263 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించి రూ. 5,96,34,020 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

బీఏఎస్ నిధుల విడుదల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల కాగానే నేరుగా ఆయా పాఠశాలలకు అందజేస్తాం. విద్యార్థులకు చదువుల పరంగా ఇబ్బందులు తలెత్తకుంటా చర్యలు తీసుకుంటాం.

– సునీత కుమారి, జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి

సొంత భవనాలు లేక ఇక్కట్లు



పంచాయతీ భవన్‌లో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

నార్నూర్: పాలన సౌలభ్యం కోసం జిల్లాలో కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రజల కోరిక నెరవేరింది. నార్నూర్ ఉమ్మడి మండలం నుంచి గాదిగూడను కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. కానీ నేటికి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో విధులు నిర్వహించేందుకు అధికారులు, ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారు.

సొంత భవనాల సమస్య..

ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసినా.. సొంత భవనాలు లేకపోవడంతో ఇరుకైన గదిలో అధికారులు విధలు నిర్వర్తిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయం, బీసీ వసతి గృహం భవనంలో పోలీస్‌స్టేషన్, ఎంఆర్ సీ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంఆర్పీ, ఈజీఎస్ మూడు కార్యాలయాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆశ్రమ పాఠశాల సిబ్బంది వసతి గృహాల్లో పశువైద్యశాల కేంద్రం, ఐకేపీ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన భవనాలు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు'

బోథ్: స్థానిక ఎన్నికలు నిర్వహించలేని కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను విమర్శించే స్థాయి లేదని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్న భయంతోనే కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందన్నారు. గత పదేళ్లలో అభివృద్ధిని అడ్డుకున్న వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాడని, ఆ వ్యక్తిని ప్రశ్నించే దమ్ము ఉందా అని నిలదీశారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోనే సాధ్యమన్నారు.

న్యాయం చేయండి

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన ముజాహిద్ అనే యువకుడు తనకు న్యాయం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డిని సోమవారం కలిశాడు. కొన్ని సంవత్సరాల క్రితం నిర్వహించిన కానిస్టేబుల్ నియామక పరీక్షకు హాజరైనట్లు తెలిపాడు. నియమాకానికి సంబంధించిన అంశం కోర్టులో వివాదంగా మారి, పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. ఇటీవల కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తాను అర్హుడిగా గుర్తింపు పొందానని తెలిపాడు. జిల్లా యంత్రాంగం ద్వారా అవసరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరాడు.

కళేబరం కలకలం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట శివారులో గత కొన్ని రోజుల కిందట చనిపోయిన పశువును గొయ్యి తీసి ఓ వ్యక్తి పూడ్చిపెట్టాడు. దానిపై ఉన్న మట్టిని కుక్కలు తవ్వాయి. దీంతో దుర్వాసన రావడంతో పశువుల కాపరీ మనిషి మృతదేహంగా అనుమానించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మనిషి శవమని గ్రామంలో వదంతులు రావడంతో సోమవారం ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీధర్, ఎస్సై విష్ణువర్ధన్, మున్సిపాలిటీ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అది పశువు కళేబరంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన యువకుడు కడారి వినోద్ కుమార్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సోమవారం వారి నివాసానికి చేరుకున్నారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

పంటరుణం కింద కోత విధించొద్దు

భీంపూర్: ఇందిరమ్మ ఇళ్ల చెల్లింపులను పంటరుణం కింద కోత విధించొద్దని మల్లెపూల సుజాత బ్యాంక్ అధికారులను కోరారు. మండలంలోని కరంజి(టీ) గ్రామానికి చెందిన సుజాత తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా విడుదలైన లక్ష రూపాయలను తీసుకుందామని వెళ్లగా బ్యాంకు అధికారులు రూ. 47,500 పంటరుణాన్ని మినహాయించి మిగతా డబ్బులను ఇచ్చారన్నారు. మిగతా ఇందిరమ్మ ఇంటి పని ఏవిధంగా చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పూర్తి చెల్లింపులను చేయాలని విన్నవించారు.

16 నుంచి దండారీ ఉత్సవాలు

- సమావేశమైన గ్రామపటేళ్లు

నార్నూర్: ఆదివాసీ గిరిజన గ్రామాల్లో దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే దండారీ ఉత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభమవుతాయని గ్రామ పటేళ్లు మెస్రం రూప్‌దేవ్, మాడవి నారంజీ పటేల్, తొడసం భీంరావు ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలో బాబేఝరి చిత్తగూడ, ఖైర్దాత్వా, మాన్కాపూర్ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దండారీ ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. 16న దండారీ ఉత్సవాలు ప్రారంభం, 17న బాబేఝరి చిత్తగూడ గ్రామానికి చెందిన తొడసం వంశస్తుల దండారీ మాన్కాపూర్ మెస్రం వంశీయుల దండారీని కలవడానికి వస్తారని తెలిపారు. 18న మాన్కాపూర్ మెస్రం వంశీయుల దండారీ బృందం ఖైర్దాత్వా గ్రామ మాడవి వంశీయుల దండారీ బృందానికి కలుస్తారని, 19న బాబేఝరి చిత్తగూడ తొడసం వంశీయుల దండారీ బృందం ఖైర్దాత్వా గ్రామ మాడవి దండారీ బృందానికి సంప్రదాయబద్ధంగా కలుస్తారని పేర్కొన్నారు. 20న దీపావళి పూజ అనంతరం కొలబడి పూజతో దండారీ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, గ్రామపెద్దలు కోట్నాక్ నానాజీ, బాజీరావు, సెడమారావు, తొడసం మాన్యు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



తాంసి: బతుకమ్మలతో విద్యార్థినులు

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగరంగుల పూలతో బతుకమ్మలను అలంకరించారు. అనంతరం కళాశాల మైదానంలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, ఉదయ భాస్కర్, దేవేందర్ మల్లేష్, కార్తీక్, ప్రవీణ్ కుమార్, రమణా రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లెక్చరర్లు, విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. డీజే చప్పుళ్ల మధ్య నృత్యం చేశారు. ఎన్ఎస్ఎస్ పీవో స్వామి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తాయన్నారు.

సుప్రీంకోర్టు జడ్జిపై దాడి సరికాదు



నిరసన తెలుపుతున్న నాయకులు

కైలాస్‌నగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం సరికాదని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అన్నారు. రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కాలిబూటు విసరడాన్ని ఖండిస్తున్నామన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ గవాయ్ దళితుడైనందునే దాడి జరిగిందని, దాడి వెనకాల ఉన్న రాజ్యాంగ విద్రోహ శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునారవృత్తం కాకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీగా చట్టాలను రూపొందించాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాంబ్లే బాలాజీ, పసుల శ్రీకాంత్, వినయ్ సాగర్, ఇండ్ల ఎల్లన్న, ఆరేపల్లి గణేష్, కల్లేపల్లి ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

లీముగూడలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీంపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని లీముగూడలో ప్రధాన మంత్రి జన్మన్ సభ్యులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ ఆధ్వర్యంలో గ్రామంలోని 57 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ చరిత్, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రోహిదాస్, మేఘ, ఆరోగ్య కార్యకర్తలు సరస్వతి, భాగ్యవతి, సుమతి, సాయికుమార్, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని గాజిలి గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు రక్తపోటు, మధుమేహం, జ్వరం, దగ్గు వంటి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగతశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్ఎం రాణి, ఆశ వర్కర్ భానుప్రియ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

నేరడిగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోధనలో సాంకేతికను జోడించి విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంచాలన్నారు. బోధనలో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునీత, ఉపాధ్యాయులు వెంకట రమణ, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

వికాస్ సహసం అభినందనీయం



వికాస్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: దారిదోపిడీ నిందితులకు ఎదురొడ్డి నిలిచిన మోజె వికాస్ సాహసోపేతం అభినందనీయమని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వికాస్‌ను శాలువాతో సన్మానించారు. ఈనెల 7న దేవాపూర్ చెక్‌పోస్టు దాటిన తర్వాత ఇచ్చోడ, బజార్‌హత్నూర్‌కు చెందిన దారిదోపిడీ నిందితులు కేంద్రే శంకర్, జాదవ్ అంకుష్, ముండే సచిన్‌లు బాధితుడి వద్ద నుంచి రూ.4లక్షలు బ్యాగ్‌ను బైక్‌పై ఎత్తుకెళ్లారని తెలిపారు. దాడి చేసినప్పటికీ భయపడకుండా బైక్‌పై వెంబడించి, సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడని, అంతే వేగంతో బట్టిసావర్గాం వరకు వెళ్లిన తర్వాత నిందితులు వారి బైక్‌ను వదిలి పారిపోయినట్లు పేర్కొన్నారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో మావల సీఐ కర్రె స్వామితో కలిసి ఘటన స్థలానికి చేరుకోవడం జరిగిందన్నారు. బైక్ ఆధారంగా నిందితుల ఆచూకీ తెలుసుకోవడం జరిగిందని వివరించారు.

ప్రజాసమస్యలు కనిపించడం లేదా?



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాత్నాల: జిల్లాలోని ప్రజాప్రతినిధులకు సమస్యలు కనిపించడం లేదంటూ.. బీఆర్‌ఎస్ నాయకులు సరస్ లింగారెడ్డి అన్నారు. భోరజ్ మండలంలోని తర్ణంలో లెవెల్ వంతెన వద్ద బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. నాలుగు నెలల క్రితం నిర్మించిన జాతీయ రహదారి రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయన్నారు. కాంట్రాక్టర్ వద్ద ముడుపులు తీసుకొని నాణ్యత ప్రమాణాలు పాటించ లేదన్నారు. రోడ్డు మరమ్మతులు చేయకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మారిశెట్టి గోవర్ధన్, పులివేణి గణేష్ యాదవ్, విజయ్ సేట్, బట్టు సతీష్, రాంరెడ్డి, మద్దుల ఉషన్న, కోలా భోజన్న, ముఖ్యరా ప్రభాకర్ పాల్గొన్నారు.

భీం, సూరు పోరాటాలు ఆదర్శనీయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: జల్.. జంగల్.. జమీన్.. అనే నినాదంతో ఉద్యమాలు చేసిన కుమురం భీం, సూరు పోరాటాలు ఆదర్శనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని దొంగచింత గ్రామంలో భీం, సూరు వర్ధంతి నిర్వహించారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే నివాసంలో దండారీ ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సుమలత

ఇచ్చోడ: సీపీఆర్‌పై ప్రతిఒక్కరనికీ అవగాహన ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి సుమలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 13 నుంచి 17 వరకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో సీపీఆర్ చేస్తే ప్రమాదం నుంచి కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ పీహెచ్‌సీ డాక్టర్లు కిరణ్‌కుమార్, మధురిమ, సీహెచ్‌వో బ్రహ్మానందం రెడ్డి, రాజుబాయి, హెచ్‌ఎస్ అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, సూభాష్ పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ గ్రామంలో సోమవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు అజీమ్ సుల్తాన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ.. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం గత కొన్నేళ్ల నుంచి ఓటు చోరీకి పాల్పడుతుందని ఆరోపించారు. యువత ఓటు చోరీ కార్యక్రమానికి మద్దతు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బోథ్: స్థానిక సంస్థల ఎన్నికల భయంతోనే బోథ్ ఎమ్మెల్యే కట్టుకథలు అల్లుతున్నారని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి విమర్శించారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలో ఓటు చోరీ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. బోథ్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ నేతలు రెవెన్యూ డివిజన్ ఇవ్వకుండా, డిగ్రీ కళాశాలను తరలించి, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయకుండా, నిధులు మంజూరు కాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న యువకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌లో ఈనెల 10న రోడ్డుపై జన్మదిన వేడుకలను జరుపుకున్న ఐదుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూ టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆ కాలనీకి చెందిన షేక్ సలీం జన్మదినం సందర్భంగా డాల్డా కంపెనీ కాలనీకి చెందిన ఆయన మిత్రులు షేక్ బబ్లూ, సయ్యద్ నవీద్, ఎండీ సల్మానొద్దీన్, అమూల్ మౌచీలతో కలిసి రహదారిపై వేడుకలు జరుపుకున్నారని పేర్కొన్నారు. కాలనీవాసులకు ఇబ్బంది కలిగించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల సందర్శన



రికార్డు తనిఖీ చేస్తున్న డీపీవో జాదవ్ దేవదాస్

సాత్నాల: మండలంలోని రామాయ, కాన్ప మెడిగూడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను, సోమవారం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జాదవ్ దేవదాస్ సందర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, నాణ్యత, సిబ్బంది హాజరు, మందుల సరఫరా, పరిశుభ్రతపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సేవలు ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ ద్వారా గ్రామస్థాయిలో ప్రాథమిక వైద్య సదుపాయాలు అందించబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ క్వాలిటీ మేనేజర్ అమర్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.